క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని పదోవార్డులో పట్టణ ప్రగతితో భాగంగా అభివృద్ధి పనులకు స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మ ప్రసాద్‌తో కలిసి శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఏఈ శాంతిస్వరూప్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భూసారంపై అవగాహన



వర్ధన్నపేట : వ్యవసాయంలో భూసార పరీక్షలు అత్యంత కీలకమైందని విద్యార్థులు దీనిపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం వర్ధన్నపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భూసారం, మట్టి సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించిన అనంతరం అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.సమత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి సాయం



గీసుకొండ : మండల కేంద్రంలో మసీదు అభివృద్ధికి స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ శనివారం రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదు అభివృద్ధికి సాయం అందించాలని ముస్లింలు కోరగా ఆయన స్పందించారు. మసీదు ఇమాం సాబ్, మహ్మద్ సోని, తాహెర్ అలీ, రహీం పాషా, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు భిక్షం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధితకుటుంబాన్ని నర్సంపేట మాంటిస్సోరి పాఠశాల చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు.

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన ఆర్ఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లందాస్ కుమార్ తండ్రి ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ శనివారం పరామర్శించి సంతాపం తెలిపారు.

కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే



వర్ధన్నపేట : వర్ధన్నపేట పట్టణంలోని పుష్కోస్ పాఠశాలలో కిడ్స్ గ్రాడ్యుయేషన్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. కేజీ, యూకేజీ చిన్నారి బాల బలికలు తమ అద్భుతమైన ప్రతిభను చాటుతూ ఆకట్టుకున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు సైతం హాజరై ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. ఫాతిమా స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ అనిత, ప్రిన్సిపాల్ సిస్టర్ డైసీ, కరస్పాండెంట్ సిస్టర్ మేరీ అంటోని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మరియపురంలో సంబరాలు

గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామం రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకుంది. సర్పంచ్ అల్లం బాలిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నల్లెల స్వప్నను శనివారం గ్రామంలోని నిర్మలామాత పొదుపు సంఘం మహిళలు, ఉపసర్పంచ్ చిరంజీవి, నల్లబెల్లి ఎంపీటీ ప్రకాశ్, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

కామర్స్ టాలెంట్ టెస్ట్

నర్సంపేట : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం డివిజన్ స్థాయి కామర్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో వివిధ కళాశాల కామర్స్ విద్యార్థులు పాల్గొని పరీక్ష రాశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని అన్నారు.

సన్మానం

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని చౌటపల్లి, ఏనుగల్లు గ్రామాల్లోని సొసైటీ గోదాములు, సొసైటీ కార్యాలయ నిర్మాణానికి టీ స్కాబ్ నుంచి రూ.కోటి 16లక్షలు నిధులు చేయించిన రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చౌటపల్లి సొసైటీ చైర్మన్ గొర్రె దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులకు శనివారం కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు.

బీఆర్ఎస్‌తోనే నర్సంపేట అభివృద్ధి

● ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది

నర్సంపేట : నర్సంపేట పట్టణాభివృద్ధి ఒక్క బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా అరకొర నిధులతో అభివృద్ధికి నోచుకోని నర్సంపేట పట్టణం నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం 4, 5, 6, 7,16, 17, 23, 24వార్డుల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో రోడ్లు, విద్యా, వైద్యం, తాగునీటి వసతి, తదితర రంగాల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు. అనంతరం 24వ వార్డుకు చెందిన పలువురు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రజనికిషన్, మునిగాల వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకటనారాయణగౌడ్, క్లస్టర్ బాధ్యులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



ఖానాపురం: అన్నప్రాసన చేయిస్తున్న అధికారులు

చెన్నారావుపేట : ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని హెచ్ఎం సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాల్‌నాయక్ తండాలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేతులు శుభ్రంగా చేసుకున్న తర్వాతనే ఆహారం తీసుకోవాలని వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గుగులోత్ కుందా, రమాదేవి, శిరీషా, జ్యోతి, బాలింతలు, తల్లులు, చిన్నారులు ఉన్నారు.

వరంగల్ (పర్వతగిరి) : చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.పూర్ణచందర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని గోపనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రజిత, ఆశవర్కర్ నవ్య, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ఖానాపురం : మండల కేంద్రంలోని రామాలయంలో పోషణ్ పక్వాడాలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలను పూజారి శివప్రసాద్‌శాస్త్రీ ఆధ్వర్యంలో శనివారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమా, పంచాయతీ కార్యదర్శి సుప్రజ, వార్డు సభ్యురాలు సంధ్య, అంగన్‌వాడీలు మల్లికాంబ, నాగమణి, ఇందిర, సుజాత, మణెమ్మ, పార్వతి, హైమావతి, ఆయాలు శ్రీదేవి, షబానా పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

సంగెం : పౌష్టికాహారం, చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ మేరుగు మల్లేశం అన్నారు. శనివారం మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ టిచర్ వెంకటలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎలుకుర్తిలో వెల్‌బేబీ షో

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో పోషణ పక్షోత్సవంలో భాగంగా శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వెల్‌బేబీ షో నిర్వహించారు. సర్పంచ్ జయపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళ్యాణి, వీఓ రమాదేవి, సీఏలు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని సోమారం గ్రామ పరిధిలో సాగు చేస్తున్న భూములకు పట్టా పాస్ పుస్తకాలు అందించాలని రైతులు కోరారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలోని భూములకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్, కలెక్టర్, సీసీఎల్ఏ అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిపారు.

ఎన్నిక



సురేందర్‌గౌడ్

సంగెం : వైఎస్సార్ తెలంగాణ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన గుళ్లపల్లి సురేందర్ గౌడ్‌ను నియమిస్తు ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ అముదాలపల్లి మల్లేశం గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానిగా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా వివిధ హోదాల్లో పనిచేసిన తనకు వైఎస్ షర్మిల నాయకత్వంలో పనిచేయడానికి అధ్యక్షుడుగా అవకాశం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. మండలంలో వైఎస్సార్ టీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు



ఉమారాణి

వర్ధన్నపేట : మండలంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన వేదాంతి ఉమారాణి తన కూతురు తూళ్ల రజిత ఇంట్లో ఉంటుంది. మతిస్థిమితం కోల్పోయి తరచూ తప్పిపోయి మరలా ఇంటికి చేరుకునేది. ఈ క్రమంలో మార్చి 15న ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటికి వెళ్లింది. తల్లి ఆచూకీ కోసం రజిత బంధువుల ఇంట్లో వెతికిన ఫలితం లేదు. దీంతో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై రామారావు తెలిపారు.

బస్‌పాస్ మేళా

రాయపర్తి : మండలంలోని గన్నారంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆర్టీసీ సిబ్బంది దివ్యాంగులకు శనివారం బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. దివ్యాంగుల కోసం ఆర్టీసీ ఉచితంగా సేవలందిస్తుందని సిబ్బంది అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

రమేష్‌యాదవ్‌కు ఘన సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న రాము, తదితరులు

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన కొమ్ము రమేష్‌యాదవ్ నర్సంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో నెక్కొండ పీఏసీఎస్ చైర్మన్ మారం రాము మాట్లాడుతూ.. రమేష్‌యాదవ్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హాట్రిక్ సాధించారన్నారు. అటు న్యాయవాద వృత్తిలోనూ.. ఇటు రాజకీయాల్లోనూ తనదైన ముద్ర చాటుతున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం రమేష్‌యాదవ్‌ను ఆయనతోపాటు పలువురు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు చల్లా చెన్నకేశవరెడ్డి, రామాలయ కమిటీ చైర్మన్ పాడిశెట్టి సత్యం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొణిజేటి భిక్షపతి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, నాయకులు తాటిపెల్లి శివకుమార్, కారింగుల సురేష్, ఈదునూరి యాకయ్య, రావుల భాస్కర్‌రెడ్డి, జుట్టుకొండ వేణు, డోలి రవి, రేగుల అశోక్, గుండ్రకోటి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి’

చెన్నారావుపేట : మండల అభివృద్ధిని ఆపేదెవరో చర్చకు రావాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్ సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. అమీనాబాద్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల అభివృద్ధిని తానే చేశానని, మాజీ పాలకులు అడ్డుకుంటున్నారని దగా కోరు మాటలు చెప్పడాన్ని ఖండిస్తున్నారు. ఉప్పరపల్లి రోడ్డు ఆపిందేవరో చెప్పాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిచి 4ఏళ్లు దాటినా మండలం అభివృద్ధి సాధించిందేదో చెప్పాలన్నారు. కమీషన్‌ల కోసం రోడ్డు ఆపిందెవరు, మహేశ్వరం నుంచి గురిజాల-లింగాపురం రోడ్డు ఆపిందెవరు, నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఎన్ని నిర్మించి ఇచ్చావో చెప్పాలన్నారు. నిరుద్యోగ భృతి, దళితులకు 3ఎకరాల భూమి, ఇలా చేసిన హామీలు ఎందుకు నెరవేర్చదని విమర్శించారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుందని ఆత్మీయ సమ్మేళనం పేరుతో మాయమాటలు చెప్పటానికి గ్రామాల్లోకి వస్తున్నారని ఆరోపించారు.అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని నీచ రాజయకీయాలు మానుకోవాలని అన్నారు. డీబీఎం-40 ద్వారా రైతులకు నీరందించిన ఘనత నాటి వైఎస్సార్ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వముదేనన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం



నెక్కొండ: మండలంలోని గొట్లకొండ శివారు ఆజ్మీరా మంగ్యానాయక్ తండాలో శనివారం సాంకేతిక లోపంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం, అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా రైతులంతా ఒకే సారి విద్యుత్ మోటర్లను వినియోగించి పంటలకు నీరందిస్తున్నారు. ఈక్రమంలో విద్యుత్ వినియోగం ఎక్కువై అధిక లోడ్ కారణంగా.. ఇన్సులేటర్లు పగిలి పెద్ద శబ్దంతో ఆజ్మీరా మంగ్యానాయక్ తండా శివారులో ట్రాన్స్‌ఫార్మర్ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టారు. 24 గంటల వ్యవధిలో సాగుకు నీరందించేలా విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ చిరంజీవి, లైన్ ఇన్‌స్పెక్టర్ భద్రయ్య రైతులకు హామీ ఇచ్చారు.

కాల్వ పనులు రద్దు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నల్లబెల్లి : రైతులకు నష్టం కలిగించే రంగయ్య చెరువు ఉపకాల్వ పనులు రద్దు చేయాలని కన్నారావుపేట రైతులు ఏఈ ప్రభావతి, ఎఫ్‌బీఓ శోభన్‌కు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కన్నారావుపేట నుంచి రాంతీర్థం గ్రామం వరకు ఉపకాల్వ చేపట్టేందుకు అధికారులు చేపట్టిన సర్వే లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. జిల్లా అధికారులు స్పందిస్తు కాల్వ నిర్మాణ పనులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు బొద్దురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వేముల సంపత్ రెడ్డి, నానబోయిన దేవేందర్, సనుప బద్రి, కాశిరెడ్డి మల్లారెడ్డి, నానబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



పదో తరగతి విద్యార్థులతో రవీందర్‌రెడ్డి

నల్లబెల్లి: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందించారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. సామాజిక కార్యకర్త భట్టు సాంబయ్యతో పాటు బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి సిబ్బంది రమేశ్‌బాబు, కిరణ్, కళావతి, రాదమ్మకు జ్యోతిరావు పూలే, మదర్‌థెరిస్సా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వార్డెన్ భాస్కర్, వర్కర్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకోవాలి

వరంగల్ (పర్వతగిరి) : జీవితంలో విజయం సాధించాలంటే ఒక స్పష్టమైన జీవిత లక్ష్యంతో పాటు సమయాన్ని సద్వినియోగం చేసుకొని అంకిత భావంతో శ్రమించినప్పుడే విజయం సాధించగలమని జాతీయ అవార్డు గ్రహీత ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ మహమ్మద్ ఆజాం అన్నారు. ఈ మేరకు మండలంలోని కొంకపాక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.విశ్వనాథశర్మ అధ్యక్షతన శనివారం జాతీయ అవార్డు గ్రహీత ఆజాం విద్యార్థులకు ప్రేరణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సామాజిక, సాంఘిక విద్యా విషయ, పరీక్షలు, ఉపయుక్తమైన జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం జాతీయ అవార్డు గ్రహీత ఆజాంను శాలువాతో సత్కరించారు. ఉపసర్పంచ్ రంగు రంజిత్‌కుమార్ గౌడ్, ఉపాధ్యాయులు వెంకటరమణ, వి.కృష్ణమూర్తి, శ్రీనివాస్, కుమారస్వామి, డి.విశ్వనాథం, వెంకటేశ్వర్లు, వి.సతీష్, లలిత, మమత పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



నర్సంపేట రూరల్ : విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న కార్తీక్



చెన్నారావుపేట : ప్యాడ్లు అందజేస్తున్న గోపాల్‌రెడ్డి



గీసుకొండ: ధర్మారం పాఠశాలలో..

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్ను తదితర వాటిని బీజేపీ నాయకులు, మిషన్ ముగ్దుంపురం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండ కార్తీక్‌గౌడ్ అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ బండారి సాంబయ్య, మార్కండేయ, జూలూరు వెంకటేశ్వర్లు, సాంబయ్య, మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : మండలంలోని మొండ్రాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు దుడ్డె స్రవంతి జ్ఞాపకార్థం శనివారం పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు దుడ్డె ప్రశాంత్, పాఠశాల హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు వీరస్వామి, రాజశేఖర్, పాష తదితరులు పాల్గొన్నారు.


గీసుకొండలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు శనివారం పరీక్షల ప్యాడ్, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి కంప సాంబయ్య జ్ఞాపకార్థం ఆయన సతీమణి రిటైర్డ్ టీచర్ వెంకటరమణ, కుమారులు శ్రవణ్‌కుమార్, పవన్‌కుమార్‌లు మాట్లాడారు. హెచ్ఎం సుజాత, ఎస్ఎంసీ కోఆప్షన్ సభ్యుడు కొక్కొండ శ్రీకాంత్, గ్రామస్తులు కొట్టె ముత్తిలింగం, గట్టు జీవన్‌కుమార్, పర్ష మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి శనివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత చదువులు చదవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, జక్కుల జగదీశ్వర్, రమేష్, విష్ణు, గణేష్, ప్రదీప్, కృష్ణమోహన్, వేణు, నవీన్ తదితరులు ఉన్నారు.

‘పది’ విద్యార్థులకు వీడ్కోలు



నెక్కొండ : భయాన్ని వీడి విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాలని ఆర్డీఎఫ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రెడ్లవాడ గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు అని ఆయన అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువులో రాణిస్తే ఉన్నతులుగా ఎదుగుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ బాబురావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్‌టికెట్ల పంపిణీ

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేసినట్లు హెచ్ఎం గారె కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు భయాందోళనకు గురి కావొద్దని ధైర్యంగా పరీక్షలను రాయాలని సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తుడు ఎడ్లపెల్లి బోస్ విద్యార్థులకు పరీక్ష మెటీరియల్స్‌ను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్ గోవర్ధన్, టి కుమారస్వామి, డి రమేష్, రాధా, సమ్మయ్య, కె మహేశ్వర్, ఎండీ అన్వర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గీసుకొండ: ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



సంగెం: గవిచర్ల మోడల్ స్కూల్‌లో..

సంగెం : పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలో ఉన్నత పాఠశాల, గవిచర్లలోని మోడల్ స్కూల్‌లో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 3వతేదీ సోమవారం నుంచి నిర్వహించనున్న పరీక్షలకు అవసరమైన మౌలిక వసతులను సర్వం సిద్ధం చేశామన్నారు. సంగెం సెంటర్‌లో 180 మంది, మోడల్ స్కూల్ సెంటర్‌లో 195మంది మొత్తం 375 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. సంగెం సెంటర్‌కు సీఎస్‌గా గాయపు లింగారెడ్డి, డీఓగా విక్రమ్‌కుమార్, మోడల్ స్కూల్ సెంటర్ సీఎస్‌గా సీఎస్‌గా సుదర్శన్, డీఓగా రవీందర్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు జరుగుతాయని విద్యార్థులు గంట ముందుగా 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని వారు కోరారు.

పరీక్షకేంద్రాలకు సమీపంలో 144 సెక్షన్ అమలు చేస్తామని ఎస్సై భరత్ తెలిపారు. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు ఎవరు రావొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


వరంగల్ (పర్వతగిరి) : ఈనెల 3వ తేదీ నుంచి జరిగే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఎంఈఓ చదువుల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి పరీక్షల కోసం మూడు కేంద్రాలు ఏర్పాటు చేయగా 548మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పర్వతగిరి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 177మంది, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 171, టీఎస్ఎస్‌డబ్ల్యూఆర్ఎస్(జి) పర్వతగిరిలో 200మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డీఓలు, 35మంది ఇన్విజిలేటర్లు పని చేయనున్నారని ఆయన తెలిపారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

గీసుకొండ : మండలంలో గీసుకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రంలో 173, ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 240, మరియపరంలోని సెంట్‌జాన్స్ హైస్కూల్‌లో 220.. విద్యార్థులు సోమవారం వార్షిక పరీక్షలకు హాజరు అవుతారని ఎంఈఓ చదువుల సత్యనారాయణ తెలిపారు. మొత్తం 35మంది ఇన్విజిలేటర్లను నియమించామని, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని వసతులు ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సీఎస్, డీఓలు సుజాత, నర్సింహాచారి, రాంచందర్, లోకేశ్వర్, శివప్రసాద్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

దుగ్గొండి : ఈనెల 3నుంచి నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని ఏ సెంటర్‌లో 134 మంది, మల్లంపల్లిలోని బి సెంటర్‌లో 126 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

‘హైవోల్టేజీ’ పుస్తకావిష్కరణ



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారు బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.మల్లికార్జున్‌రెడ్డి, రాగిడి రణధీర్‌రెడ్డి, రావుల స్వాతిరెడ్డి ‘హై వోల్టేజీ’ పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, వీఎస్ హరిహరన్, ఏఓ సురేష్, నారాయణ, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.